# థాంక్యూ బేబీ! థాంక్యూ!!

మాట్లాడు బేబీ మాట్లాడు
మనస్సులో మధువులు చిమ్ముతూ మాట్లాడు
నీ నాలుకపైన నాట్యం చేసే స్వరాలు
నీ చిన్నారి పెదవులు గులాబీరంగుల ఇంద్ర ధనుస్సుల్లా
ఒంపులు తిరిగినప్పుడు ఒలికే శబ్దాలు
నీ మూసిన పెదవుల పెట్టెల్లో దాచిన రత్నవీణలు
తానం పలకడానికి చేసే ప్రయత్నాలు
నీ సంతృప్తి గుమ్మరించే మధుర ధ్వనులు
నీ సగర్వ మందహాసాల నాదలేశాలు
నిగమాలకన్నా నిగూఢమైనవి
అర్థమవని నీ మాటలు రైళ్ళు రాబోయే ప్లాట్‌ఫారాలు
వింత ధ్వనిచేసే నీ గొంతుక ఓపెన్ కాబోయే రేడియో స్టేషన్
మాట్లాడు బేబీ! మాట్లాడు!
తెలియరాని నీ మాటల ద్వారా
తెలుసు కొంటాను మన భాషల పుట్టుక
అచ్చులూ హల్లులూ నీ కంఠంలో చేస్తున్న
అపూర్వమైన మహాసభని తిలకిస్తాను
నీ ముద్దుమాటల అద్దంలో నా చిన్నప్పటిముఖం చూసుకుంటాను
నీ ఊసుల పూసలకి భావాల దారాలు లేవుగాని
నీ చక్కని పదాల ముక్కలు నా గుండెలకి రెక్కలిస్తాయి
ఎవరూ వీక్షించనపుడు నువ్వు పలికే నుడులు
ఏ బాణుడు ఎంగిలిచేయని పిండివంటలు
పదాలకి తగ్గట్టు నువ్వు తిప్పుకునే చేతి ఊపులు
బాలసరస్వతికి అభినయం నేర్పే ముద్రలు
ఎడతెగకుండా నువ్వు పొడిగించే మాటల కాంబినేషన్లు
ఏ విశ్వనాథ సత్యనారాయణా కట్టలేని సమాసాలు
దేవుడికన్నా గడుసు వాడివి నువ్వు
మా వాక్యాలు అర్థం చేసుకుంటావుగాని
నీ ఉద్దేశాలు అర్థం కానివ్వవు
దేవతలకన్నా మంచిదానివి నువ్వు
ఏ విహాయస పథాలలోనో విలీనమైపోతాయి వాళ్ళ గానాలు
నీ వినిర్మల స్వరాల సింఫొనీ
గుండెల్లో ఊపురికార్డు చేసుకోనిస్తున్నావు
మళ్ళా వినే అవకాశం మనస్సులో
కలకాలం నిలుపుకోనిస్తున్నావు
థాంక్యూ బేబీ! థాంక్యూ!

—ఆరుద్ర

'మీ అమ్మ బలే మార్గం కనిపెట్టిందిరా డబ్బు సంపాదనకి' అని తోటి ఫ్రెండ్సందరూ కాలేజీలో అంటూంటే నాకు తల కొట్టేసినంతపని అవుతోంది"

పరిమళకి ఆ కంఠం ఎవరిదో జ్ఞాపకంవచ్చింది!

తిరిగి శాస్త్రి కేకలు వినిపించాయి.

"అదృష్టం దురదృష్టం సంగతి నాకు అనవసరం. అయినా నాకు వాటిమీద నమ్మకంలేదు. నువ్వు ఎంత చెప్పినా సరే నీకు దేవుడు కనిపిస్తున్నాడంటే నేను నమ్మను... ...అంటే నువ్వనేదేవిటి?... డబ్బుకోసం దేవుడు కనిపించాడంటూ దేవుడిపేరు వాడుకుంటావా? ...నిజమో కాదో అదంతా నాకు అనవసరం...ఇవాళ నుంచి నువ్వింకా ఈ పద్ధతి మానెయ్యాలి!...ఆ...మాడితే మాడతాను...ఈ డబ్బుమీద చదువుకోవడంకంటే చదువు మానెయ్యడమే మంచిది ... ఇప్పుడేం వచ్చిందా? నువ్వు తప్పకుండా జరుగుతాయని ఘంటాపథంగా చెప్పినవి పది పదిహేనుదాకా ఏమీ జరక్కుండా తగలడ్డాయని బజార్లో నలుగురూచెప్పుకుని నవ్వుకుంటున్నారు, వెళ్ళి విను. అన్నింటికంటేముఖ్యం నిన్న రాత్రి చౌదరిగాడు నీజోస్యం విన్న దగ్గర్నుంచీ చప్పగా చల్లారిపోయి నీళ్ళుకారిపోతున్నాడు. ఏడెనిమిది వందలు ఖర్చుపెట్టి చివరికి అంతా చేతికి దక్కేసమయంలో గట్టిగా నిలబడకుండా కాళ్ళు జాపేస్తున్నాడు. 'మీ అమ్మగారి ద్వారా దేవుడు చెప్పాడురా - ఇంకెందుకు ప్రయత్నం?' అంటున్నాడు. వాడు బుద్ధిలేక నాకు తెలియకుండా నీ దగ్గరికి రావడం నువ్వు వాడి ఉత్సాహం మీద కాస్తా నీళ్ళు జల్లడం, ఇవాళ వీడిలా జారిపోయి ఓడిపోతే రేపొద్దున్న నేనెవరికేనా మొహం చూపించగలనా? నా పలుకుబడీ, తెలివీ చాకచక్యం అన్నీ కుదువబెట్టి ఈఎన్నికలు నడిపిస్తున్నాను... నెగ్గితేనా?... నెగ్గితే వాడు మనకేం ఇస్తాడు? అయినా వాడి డబ్బు ఎవడిక్కావాలి...మాట పట్టుదలా-స్నేహం-అంతే. ఇన్నాళ్ళనుంచి ఇద్దరు స్నేహంగా ఉన్నాం. నాగురించి వాడినొక్కకాణీ ఖర్చు పెట్టనిచ్చానా?...లక్షలుంటే?... ఉంటే తింటాడు... నువ్వు లక్షచెప్పు... నాకా డబ్బుదృష్టిలేదు... డబ్బులేక చచ్చిపోం... తెలివితేటలూ మంచితనం ఉంటే జయించవచ్చు జీవితంలో... మళ్ళీ అదృష్టమో అదృష్టమో అంటావు, అదృష్టం ఏవిటి? మన నీడలాంటిది... అది ఉంది ఉంది అనుకుంటూ దానివెనకాల పరిగెత్తితే పారిపోతుంది అందకుండా ... లేదులేదు అనుకుంటూ వెళ్ళిపో... అదే నీ వెంట పడుతుంది. అసలు ఉండడం అంటూ వుంటే...నీతో వాదించలేనే నేను ... ఏమైనాసరే ఆఖరిసారిగా చెబుతున్నాను. నువ్వు రేపటినుంచి ఈ దేవుడూ - కనిపించడం ఇదంతా మానకపోతే నేను ఇంట్లోంచి వెళ్ళిపోతా ... ఆఁ!... ఈ గొడవలోపడి ఎలా పాలిపోయి చిక్కిపోయావో చూడు... నా బెంగ నీకు వద్దన్నానుగా... అంతే!"

ఇంకా పైన వినిపించలేదు పరిమళకి.

"అవును. శాస్త్రి అంటే జ్ఞాపకం వచ్చింది. ప్రెసిడెంటు ఎన్నికలు రేపేకదూ? ఈ హాస్టలూ అల్లరీ, సత్యాగ్రహాలూ వీటిలోపడి వాటి సంగతే చూడడంలేదు. అసలు పరిస్థితి ఎలా వుందో నాలుగు చోట్లకీ వెళ్ళి వాకబు చెయ్యాలి. ఈ హాస్టల్ గొడవవల్ల సాటి గరల్ స్టూడెంట్సు సరిగా సాయం చెయ్యకపోయినా, తప్పకుండా ఓటువేస్తాం అని లోగడ వాగ్దానం చేసిన ఇతర విద్యార్థి సోదరులు ఉన్నారుకదా-వాళ్ళకి ఓమాటు జ్ఞాపకం చేసివద్దాం" అని బట్టలు మార్చుకుని రూమ్‌కి తాళం వేసి బయటకి వచ్చి గేట్ చిడత తీస్తూ ఉండగా ఎదురింటి అరుగుమీద పచార్లు చేస్తూ శాస్త్రి కనిపించాడు పరిమళకి.

శాస్త్రి ముఖం చూడగానే చౌదరి లాడ్జిలో అతను మాట్లాడిన పద్ధతీ, మాటలూ అన్నీ జ్ఞాపకం వచ్చాయి. పరిమళ అసహ్యంగా ముఖం తిప్పుకుని అడుగు కదప బోయింది. కాని శాస్త్రి ఇంతలో ఆమెని పలకరించాడు.

"ఏవిటి? మీరీ ఇంట్లోకి అద్దెకి వచ్చారా? మీరీ మధ్య సత్యాగ్రహం హడావిడీ ఏవో చేశారట! దాని ఫలితమేనా ఇది? బాగుంది - ఆ... అన్నట్టు... రేపేకదా స్టూడెంటు ప్రెసిడెంటు ఎలక్షను? మీ ప్రయత్నం ఎంతవరకూ వచ్చింది? ఇంకా మీకు నెగ్గుతాం అనే నమ్మకం పోలే నట్టుంది" అంటూ నవ్వాడు.

పరిమళ అతని ముఖంలోకి సూటిగా- కోపంగా చూసి ఏం సమాధానం చెప్పకుండా గబ గబా నడిచి వెళ్ళిపోయింది. శాస్త్రి ఆమె కోపం చూసి నవ్వుకుని "పాపం! ... ప్చ్! అని నిట్టూర్చాడు.

[సశేషం]

Source: Press Academy Website, Pragathi Patrika, December 1969

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/